www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 06 | ఏప్రిల్ | 2026
పేజీలు : 8

## ఆడిట్‌లో బయటపడని అవినీతి..!




-ఖమ్మంలో విందు పార్టీ?
-పేరుకే ఆడిట్.. అంతా గప్‌చుప్
-అవినీతి బయటపడకుండా లోపకారిక ఒప్పందాలు

6 లో

# అర్బన్ విభజన ఎప్పుడు...?



**-ఇబ్బందులు పడుతున్న ప్రజలు**
**-అర్బన్ మండలాన్ని విడదీయాలని డిమాండ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం అర్బన్ మండలాన్ని విభజించాలని ప్రజలు చాలా కాలంగా కోరుతున్నా ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. కొంత కాలం క్రితం ఖమ్మం అర్బన్ మండలాన్ని విభజిస్తున్నారని ప్రచారం జరిగినప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఖమ్మం పట్టణం మొత్తం అర్బన్ మండల పరిధిలో ఉన్నది. ఖమ్మం పట్టణ జనాభా ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగింది. వ్యాపార వాణిజ్యానికి కేంద్రంగా మారడంతో జనాభా గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఉపాధి అవకాశాలతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట తో పాటు ఇటు ఆంధ్రప్రదేశ్ సరిహద్దు జిల్లాలనుంచి ఎక్కువ మంది ఖమ్మంలో స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో పనిచేస్తున్న అనేక మంది ఉద్యోగులు సైతం ఖమ్మంలోనే స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. విద్య, వైద్యానికి హైదరాబాద్ తర్వాత ప్రధాన నగరంగా మారడంతో జనాభా ఖమ్మంలో పోగు పడుతుంది. దీనికి తోడు అన్ని రంగాలకు చెందిన కార్పోరేట్ వ్యాపార సంస్థలు ఖమ్మంలో తమ వ్యాపారాలను ప్రారంభించడం కూడా నగర జనాభా పెరుగుదల, విస్తరణకు కారణమవుతుంది. సుమారు ఐదు లక్షల జనాభా ఉన్న ఖమ్మం మొత్తం ఖమ్మం అర్బన్ రెవెన్యూ పరిధిలో మాత్రమే పనిచేస్తుంది. పెద్ద ఎత్తున పెరిగిన జనాభాకు అనుగుణంగా రెవెన్యూ సేవలు అందించడంలో జాప్యం జరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగడం ఇబ్బందికరంగా

మిగతా 2లో..

## బెట్టింగ్ మాయలో యువత..!



**-బెట్టింగ్ వ్యసనంతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం**
**-ఆత్మహత్యలకు పాల్పడుతున్న యువత**
**-చిన్నాభిన్నమవుతున్న మధ్య తరగతి కుటుంబాలు**
**-ఐపీఎల్ ప్రారంభంతో మరింత జోరుగా బెట్టింగ్‌లు**

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** బెట్టింగ్ తో కొందరి జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. గెలిచిన వారు అత్యాశతో మళ్లీ డబ్బులు పెడుతూ పోగొట్టుకుంటున్నారు. ఓడిన వారు అప్పుల్లో కూరుకుపోతున్నారు. ముఖ్యంగా విద్యావంతులైన యువత ఈ మాయలో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. బెట్టింగ్ యాప్స్ భారిన పడి ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు సైతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చోటు చేసుకున్నాయి. ఆన్లైన్లో గేమ్ నుంచి మొద లైన వ్యసనం తర్వాత బెట్టింగ్స్ కు దారి తీస్తున్నాయి. ఒకప్పుడు పట్టణాలకే పరిమితం కాగా ఇప్పుడు పల్లెలకు సైతం పాకింది. ప్రస్తుతం ఐపీఎల్ షురూ కావడంతో క్రేజ్ పెరిగింది. దీనిని ఆసరాగా చేసుకొని కొంతమంది వ్యసనంగా మార్చుకున్నారు. యువతతో పాటు ఉద్యోగులు, విద్యార్థులు బెట్టింగులకు ఆకర్షితులవుతున్నారు. తెలిసీ తెలియని వయస్సులో

మిగతా 2లో..

## జగ్జీవన్‌రామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క



**ప్రజాపక్షం/ ఖమ్మం :** బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లి ఆయన చూపిన మార్గంలో నడవడమే మనం ఆయనకు ఇచ్చే సరైన నివాళి అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఆదివారం ఖమ్మం నగరంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టిఆర్ సర్కిల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. దేశ ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేయడంలో బాబు జగ్జీవన్ రామ్ పాత్ర చిరస్మరణీయమన్నారు. దేశ భవిష్యత్తుకు ఆయన ఒక దిక్సూచిలా నిలిచారన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎంఎల్‌ఎ రాందాస్ నాయక్, ఇల్లందు ఎంఎల్‌ఎ కోరం కనకయ్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎస్సి సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి. జ్యోతి, ఎస్సి కార్పోరేషన్ ఈడి నవీన్‌బాబు, వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అర్బన్ విభజన ఎప్పుడు...?

(మొదటిపేజీ తరువాయి)

మారింది. ధృవపత్రాల మొదలు అన్నింటికి మండల రెవెన్యూ కార్యాలయం కేంద్రం కావడంతో సేవలు అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఖమ్మం జిల్లాలో 20 మండలాలు ఉండగా ఏ మండలంలోనూ 50వేలకు మించి జనాభా ఉండడం లేదు. కానీ ఖమ్మంలో మాత్రం ఐదు లక్షల వరకు జనాభా ఉండడంతో ఖమ్మం అర్బన్ మండలాన్ని మూడు టౌన్ల పరిధిలో మూడు రెవెన్యూ కార్యాలయాలను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వినవస్తుంది. విభజన ద్వారా సేవలు సరళీకృతమవుతాయని తద్వారా ప్రజలకు త్వరితగతిన సేవలు అందించే అవకాశం ఉంది. ఖమ్మం జిల్లాకు సంబంధించి ముగ్గురు మంత్రులు రాష్ట్ర మంత్రి వర్గంలో ఉండటం ప్రధానంగా ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు స్థానిక శాసన సభ్యునిగా తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ శాఖ మంత్రిగా ఉండడంతో విభజన చేయడానికి పెద్ద ఇబ్బంది ఉండక పోవచ్చు. వికేంద్రీకరణ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వం అర్బన్ రెవెన్యూ మండలాన్ని విభజించేందుకు ఇది సరైన సమయమని ఆ దిశగా ఆలోచన చేయాలని ప్రజలు కోరుతున్నారు. జనాభా ఎక్కువగా ఉండటం నగరం బాగా విస్తరించడంతో అధికారులకు సైతం పని భారం ఎక్కువవుతుంది. అర్బన్ మండల విభజనపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని అర్బన్ మండల ప్రజలు కోరుతున్నారు.



# బెట్టింగ్ మాయలో యువత..!



(మొదటిపేజీ తరువాయి)

బెట్టింగ్ ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టాలను చవిదూ స్తున్నారు. కూలీ నాలి చేసుకునే వారు, ప్రైవేట్ ఉద్యోగులు సైతం బాధితులుగామారు తుండడం గమనార్హం.

**లొకేషన్లు మారుస్తూ..**

ఆన్ లైన్ బెట్టింగ్ నిషేధం ఉన్నప్పటికీ యాప్ల ద్వారా లోకేషన్ చేంజ్ చేస్తూ వీటిని నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు నిరుద్యోగ యువత యాప్ ద్వారా ఆన్లైన్ బెట్టింగ్స్ కొనసాగిస్తున్నారు. పదుల సంఖ్యల్లో వెబ్సైట్లు, యాప్‌లలో ఇది నడుస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఐపీఎల్ సందర్భంగా జోరుగా బెట్టింగ్ సాగుతున్నట్లు తెలుస్తోంది. జట్టులో ఆటగాళ్ల తీరు, మ్యాచ్ గెలిచేదెవరు, ఫోర్, సిక్స్ ఇలా అన్నింటికి వేల రూపాయల్లో బెట్టింగ్ పెడుతున్నారు. యువకులతో పాటు పలు వ్యాపారులు సైతం ఈ మోజులో పడి అప్పుల పాలవుతున్నారు. ఈ క్రేజ్‌ను దందాగా మలుచుకొని కొంత మంది బెట్టింగ్ యాప్ ద్వారా తమ జేబులు నింపు కుంటున్నారు.

**బెట్టింగులపై పోలీసుల ఫోకస్..**

ఆన్లైన్ బెట్టింగ్లపై పోలీసులు ఫోకస్. ఇంటిలిజెన్స్ నిగా పెట్టారు. సీసీఎస్ సిబ్బంది కన్నేసి ఉంచారు. ఎక్కడైనా ఆన్లైన్ బెట్టింగ్ సాగుతున్నట్లు సమాచారం అందిస్తే వెంటనే అప్రమత్తమవుతున్నారు. వారిపై కేసులు పెడుతున్నారు. రాష్ట్రంలో ఆన్లైన్ బెట్టింగ్ నిషేధం ఉంది. ఇటీ వల ప్రభుత్వం అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు అదేశాలు జారీ చేసింది. దీంతో వారు అవగాహన కార్యక్రమాలతో పాటు బెట్టింగ్ లు అరి కట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నా రు. ఎక్కుడైనా బెట్టింగ్ జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు చెబు తున్నారు.

# ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభం

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని మీనవోలు గ్రామంలో ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ అధ్యక్షులు జనాబ్ మౌలానా షేక్ ముజాహిద్, ఉపాధ్యక్షులు జనాబ్ షేక్. హుస్సేన్ సాహెబ్ ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ మెగా టోర్నమెంట్‌లో 60జట్లు తలపడ నున్నాయని నిర్వాహకులు తెలిపారు. యువతను ఉత్సాహపరిచే విధంగా ఐక్య సంఘం సభ్యులు భారీ బహుమతులు అందించను న్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మౌలానా షేక్ ముజాహిద్ మాట్లాడుతూ ఎర్రుపాలెం మండలంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న ముస్లిం ఐక్య సంఘం కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్రికెట్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ ప్రతిభను, మంచి ప్రదర్శన కనబర్చి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా ప్రతికూలరిలో ఆత్మ విశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని అన్నారు. ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మండలంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదపడుతాయని, ఐక్యమత్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌసుద్దీన్, మండల అధ్యక్షులు బాసిత్ అలీ, ఉపాధ్యక్షులు మొహమ్మద్ రఫీ, మండల ట్రెజరీ షేక్.నాగుల్‌మీరా, ఇన్‌చార్జి ఇస్మాయిల్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



# బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

**-వివాహిత నుండి రూ.35లక్షల వసూలు**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలానికి చెందిన ఓ వివాహితను చంపుతానని బెదిరించి ఆమె వద్ద నుండి రూ 35లక్షలు కాజేసిన వ్యక్తిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. బూర్గంపాడు ఎస్ఐ మేడ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం బూర్గంపాడు మండలానికి చెందిన ఓ వివాహితను పాల్వంచకు చెందిన బిట్రగుంట శ్రీనివాసరావు ఫేస్‌బుక్‌లో పరిచయం చేసుకున్నాడు. ఆ తరువాత ఆమెతో స్నేహంగా ఉంటున్నట్లు నటించి, ఆ తరువాత ఆమెను చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఆమె వద్ద నుండి పలు దఫాలుగా రూ 35లక్షలు కాజేసిన బిట్రగుంట శ్రీనివాసరావును అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ పంపించారు. ఆ వివాహిత కూడా ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి అయిన తన తండ్రి బ్యాంకు ఖాతా నుండి పలు విడతలుగా ఈ నగదును అతనికి ఇచ్చినట్లు విచారణతో తేలింది. తన బ్యాంకు ఖాతాలో నగదు లేకపోవడంతో వివాహిత తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు ఆ వివాహితతో పాటుగా పాల్వంచకు చెందిన బిట్రకుంట శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.



## జాతికి స్ఫూర్తి బాబు జగ్జీవన్‌రామ్




**ప్రజాపక్షం/ ఖమ్మం :** జాతికి స్ఫూర్తి బాబు జగ్జీవన్ రామ్ అని ఆయన బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేశారని రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్ లు తెలిపారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సంఘ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప ప్రధానిగా, కేంద్ర మంత్రిగా విభిన్న పదవులు నిర్వహించి దేశాభివృద్ధి కోసం ఆయన కృషి చేశారని వారు తెలిపారు. ఆయన జీవితం నేటి తరాలకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో పింఛన్‌దారుల సంఘం నాయకులు పెదమాళ్ల సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, జి. రామనాథం, సుధాకర్, ప్రసాదరావు, కృష్ణయ్య, నాగేశ్వరరావు, వెంకటాచారి, కోట్యా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి



**ప్రజాపక్షం/వైరా:** భారత మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలను వైరాలో ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో బాబు జగజ్జీవన్‌రా జయంతి సందర్భంగా జగజ్జీవన్‌రావ్‌చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** మోటార్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరు యువకులను లారీ ఢీకొనడంతో ఇద్దరు యువకులు అక్కడిక క్కడే మృతిచెందిన ఘటన అశ్వారావుపేట మండల పరిధిలోని గాండ్లగూడెం శివారులో జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా జీలుగు మిల్లి మండలం తాటిరామన్న గూడెం గ్రామానికి చెందిన మడకం సంతోష్ (19), అదే గ్రామానికి చెందిన పండు సందీప్ (20) అశ్వారావుపేట మండలం చిన్నోడిగుంపు గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి మోటార్ సైకిల్ బయలు దేరారు. బచ్చువారిగూడెం దాటి గాండ్లగూడెం శివారు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. అశ్వారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరు వ్యవసాయ కూలీ కుటుంబాలకు చెందిన వారు కావడంతో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.



## మహిళా కౌన్సిలర్‌పై దాడి

**-పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాలు ఫిర్యాదు**

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో అమృత పైప్‌లైన్ నిర్మాణ పనులు జరుగుతూ ఉన్నవి. ఆ పనులు పదేపదే అడ్డుకుంటుంటే కౌన్సిలర్ ముళ్లపాటి విజయ ఆదివారం తానే దగ్గరుండి పైప్‌లైన్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తుండగా వార్డుకు చెందిన అన్వర్ మరి కొంతమంది వ్యక్తులు అక్కడికి వచ్చి అభివృద్ధి పనులకు అడ్డుకొని పైపులు నిర్మాణాన్ని ముందుకు పోకుండా ఇబ్బంది పెడుతూ నాపై దాడి చేశారు. అసభ్యంగా పదజాలంతో మాట్లాడుతూ మహిళ అని చూడకుండా నా మీద చేయి వేసి నెట్టే కాలంలో పడవేశారు. లుంటీ ఇప్పి మరీ అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ దాడిలో నా కాళ్లకు గాయం అయ్యిందని వైరా పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలర్ ముళ్ళపాటి విజయ ఫిర్యాదు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకున్నారు.



# సమస్యల పరిష్కారానికే ఇంటింటికీ సిపిఐ

**-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట, బెజవాడ**





ప్రజాపక్షం/బోనకల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకే ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, బెజవాడ రవిబాబు తెలిపారు. మండలంలోని కలకోట గ్రామంలో సిపిఐ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట రమాంజనేయులు, బెజవాడ రవిబాబులు మాట్లాడుతూ గ్రామాల్లో అర్హత గల పేదలు పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు ఎదురు చూస్తున్నారన్నారు. ఐదు రోజులకు ఒకసారి మిషన్ భగీరథ మరమ్మత్తుల వల్ల నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే శాశ్వత మరమ్మత్తులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యాలయం నూతన కార్యాలయం మంజూరు చేయాలని, స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మించాలని కోరారు. సాగర్ జలాలతో కలకోట చెరువు నింపాలని, కలకోట నుంచి మోటమర్రి వరకు రోడ్డును, కలకోట బ్రాహ్మణపల్లి మధ్య నున్న కల్వర్టు పూర్తి చేయాలని, సైడ్ డ్రైనేజ్‌లు, సీసీ రోడ్లు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని కోరారు. కలకోట చెరువుకు ట్యాంక్ బండ్ నిర్మాణం, విద్యుత్ దీపాలు త్వరతగతిన పూర్తి చేయాలని చేయాలని సిపిఐ జిల్లా సమితి పక్షాన డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సమితి సభ్యురాలు బత్తినేని నీరజ, మండల కార్యదర్శి యంగల ఆనందరావులు ఇంటింటికి సిపిఐ కార్యక్రమ కరపత్రాలను పంపిణీ చేసి, సమస్యలను పత్రాలను రాసి సిపిఐ మండల సమితి దృష్టికి తీసుకురావాలని, తద్వారా పోరాటాలతో సమస్యలను పరిష్కరించేందుకు సన్నద్ధమవుతా మని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు మాతంగి శ్రీనివాసరావు, యంగల వెంకటమ్మ, మత్స్యశాఖ సొసైటి అధ్యక్షులు బలుగూరి అచ్చయ్య, శాఖ కార్యదర్శి యంగల పెద్ద రమేష్, వార్డు మెంబర్లు యంగల కృష్ణవేణి, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు షేక్ అబ్బాస్‌మియా, యంగల రమ్య, మరీయమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

# బత్తినేని ట్రస్ట్ వైద్య సేవలు అభినందనీయం



**-67వ బిపి, షుగర్ ప్రత్యేక క్యాంపు విజయవంతం**

**-ప్రముఖ బిపి, షుగర్, జనరల్ వైద్య నిపుణులు పవన్‌కుమార్**

ప్రజాపక్షం/బోనకల్: ప్రతి తొమ్మిది మందిలో ఒకరికి షుగర్ ఉన్నా సగం మందికి ఆ విషయమే తెలియట్లేదని ప్రముఖ బిపి, షుగర్, జనరల్ వైద్య నిపుణులు టి పవన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో అమరజీవి, సిపిఐ సీనియర్ నాయకులు తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం బిపి, షుగర్ 67వ ప్రత్యేక క్యాంపు తూము ప్రకాశరావు భవన్‌లో ఆదివారం విజయవంతమైంది. ఈ సందర్భంగా వైద్యులు టి పవన్‌కుమార్ మాట్లాడుతూ చక్కెర వల్లే షుగర్ వ్యాధి వస్తుందనుకోవడం కేవలం అపోహ మాత్రమేనన్నారు. వ్యాయామం చేయకపోవడం పాటు వంశపారంపర్య కారణాలు కూడా షుగర్, బీపీలకు ప్రధాన కారణమని అన్నారు. సన్నగా ఉన్నా, చిన్న వయస్సు వారైనా ముందస్తు పరీక్షలతో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. బెల్లం, తేనె వాడినా షుగర్ పెరుగుతుందని, ఒత్తిడి తగ్గించుకోవడం, సరైన ఆహార అలవాట్లతో షుగర్ కంట్రోల్‌లో ఉంచుకోవచ్చని తెలిపారు. షుగర్, బిపి ఉన్నవారు పట్టణ ప్రాంతానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలంటే మందులతో సహా వేలల్లో ఖర్చు అవుతున్నాయని అన్నారు. ప్రత్యేక క్యాంపు వచ్చే వారికి ఖర్చుతో పాటు సమయం కూడా కలిసి వస్తుందని పేర్కొన్నారు. ఈ క్యాంపులో 100 మంది వైద్యులు పవన్‌కుమార్ వైద్యసేవలు అందించగా, క్యాంపు నిర్వాహకులు క్యాంపు నిర్వహించారు. ఐదేళ్లుగా నిర్విరామంగా క్యాంపులను నిర్వహిస్తున్న బత్తినేని చారిటబుల్ ట్రస్ట్, సిపిఐ మండల సమితి సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు మండల కార్యవర్గ సభ్యులు ఆకెన పవన్, ఏలూరి పూర్ణచంద్రరావు, కొంగర కృష్ణయ్య, కొంగర భాస్కరరావు, సిపిఎం నాయకులు షేక్ నజీరు, కాంగ్రెస్ నాయకులు తోట ప్రభాకర్‌రావు, క్యాంపు సహాయకులు యంగల గిరి, ఉజ్వల్ చరణ్, టి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

ప్రజాపక్షం/సత్తుపల్లి: వంటింటి గ్యాస్ ధరలను యుద్ధం పేరుతో పెంచడం అన్యాయమని వెంటనే తగ్గించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం సత్తుపల్లి మండల కార్యదర్శి జాజిరి జ్యోతి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని సిద్దారం గ్రామంలో ఆదివారం ఐద్వా గ్రామ కమిటీ, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ధరలు అమాంతం పెరిగిపోయాయని, దీంతో సామాన్య ప్రజలు తినలేని, కొనలేని పరిస్థితుల్లోకి నెట్టబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఐద్వా గ్రామ నూతన కమిటీ 13 మందితో వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు ఎలగం పార్వతి, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు తోట కూర నారాయణమ్మ, వాసం సీతారామమ్మ, ఆముదాల దేవి, వాసం నిర్మల, మేడిది అనసూర్య, ఎలగం వెంకటమ్మ, రేసు లక్ష్మి, రాయిని తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తి ప్రదాత బాబు జగ్జీవన్‌రామ్

**- మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత**

**- కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు**



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: దళితుల హక్కులు, సామాజిక సమానత్వంతో పాటు దేశ స్వాతంత్ర్య కోసం పోరాడిన గొప్ప నాయకుడు మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ అని చైర్ పర్సన్ పోకబత్తిని అనిత అన్నారు. ఆదివారం ఏదులాపురంమున్సిపాలిటీ కార్యాలయంలో 118వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, ఉద్యోగులు, సిబ్బంది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...1908 ఏప్రిల్ 5న బిహార్ రాష్ట్రంలో జన్మించిన బాబూజీ స్వాతంత్ర్య సమరయోధుడిగా, దళిత వర్గాల ఆశాజ్యోతిగా విశేష సేవలు అందించారన్నారు. అంటరానితనం నిర్మూలను, సామాజిక సమానత్వం సాధనలో ఆయన జీవితాంతం పోరాటం చేశారన్నారు. ఈ కృషి దేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిందన్నారు. అలాగే దేశ రక్షణ, వ్యవసాయ రంగంలో కీలక బాధ్యతలు నిర్వహించిన బాబాజీ, భారతదేశం అభివృద్ధికి విశేష సేవలు అందించారన్నారు. కేంద్ర మంత్రిగా ఉపప్రధానిగా పనిచేసిన సమయంలో ప్రజల సంక్షేమానికి అనేక కీలక నిర్ణయాలు తీసుకుని దేశ ప్రగతికి బాటలు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బానోత్ దివ్య, బుర్ర మహేష్, బైరు కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు కందుకూరి వెంకటనారాయణ, సంఘాని వెంకటేష్, మున్సిపాలిటీ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, జవాన్ హుస్సేన్, బిల్ కలెక్టర్స్ పాషా, నాగమణి, వంగూరి రామకృష్ణ, కళ తదితరులు పాల్గొన్నారు.

## మహోన్నత వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్



ప్రజాపక్షం/బోనకల్: బాబు జగ్జీవన్ రామ్ దేశం కోసం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి అని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ కేంద్రంలో వివిధ మంత్రిత్వ శాఖలలో మంత్రిగా, ఉప ప్రధానిగా పని చేశారని తెలిపారు. ఇండియా, పాకిస్తాన్ పోరాటంలో పాల్గొన్నారని, అప్పటి కేబినెట్‌లో యువమంత్రిగా పనిచేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుబాటులో వచ్చేలా ఆయన కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా హాస్పటల్ అధినేత, ప్రముఖ వైద్యులు టి పవన్‌కుమార్, సిపిఐ మండల నాయకులు ఆకెన పవన్, కొంగర భాస్కరరావు, ఏఐవైఎఫ్ మండల నాయకులు షేక్ బాజీ, యంగల గిరి, ఉజ్వల్ చరణ్, టి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ యూనిట్ల కేటాయింపు

ప్రజాపక్షం/సత్తుపల్లి: మండలానికి చెందిన షెడ్యూల్డ్ కులాల యువతీ, యువకులు స్వయం ఉపాధి పొందేందుకు ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో యూనిట్లు కేటాయించబడ్డినట్లు ఎంపిడిఓ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. రవాణా రంగంలో 9 ఈవీ రెండు చక్రాల వాహనాలు (ఒక్కో యూనిట్ విలువ రూ.1 లక్ష), 4 ఈవీ మూడు చక్రాల వాహనాలు (ఒక్కో యూనిట్ విలువ రూ. 3 లక్షలు) అందుబాటులో ఉన్నాయని, పశుసంవర్ధక పథకం కింద 5 పాడి గేదెల యూనిట్లు (ఒక్కటి రూ.2.40 లక్షలు) కేటాయించగా, వ్యవసాయ పథకం కింద ఒక సౌర విద్యుత్ మోటార్ పంప్ సెట్ (రూ.7 లక్షలు) ఇవ్వనున్నారు. అదేవిధంగా శిక్షణ కార్యక్రమాల్లో వేతన ఉపాధి కింద 2 యూనిట్లు (ఒక్కటి రూ.0.40 లక్షలు), స్వయం ఉపాధి కింద 2 యూనిట్లు (ఒక్కటి రూ. 0.15 లక్షలు) ఏర్పాటు చేశారు. అర్హులైన అభ్యర్థులు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఓబిఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల చివరి తేదీ ఏప్రిల్ 8, 2026గా నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారు తమ పత్రాలను దరఖాస్తు చేసిన రోజు సాయంత్రం 5 గంటల లోపు సత్తుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో తప్పనిసరిగా సమర్పించాలన్నారు. 8 లోపు పత్రాలను సమర్పించని అభ్యర్థులు యూనిట్లకు అనర్హులుగా పరిగణించబడతారని అధికారులు తెలిపారు.

## వెలుగులు నింపిన కొత్త కరెంట్ పోల్స్

**- కౌన్సిలర్ దండి రంగారావు చొరవకు ప్రజల అభినందనలు**



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డులో కొత్త పోల్స్ ఏర్పాటు చేసి లైట్లు అమర్చడంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆ వార్డు సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు కరెంట్ ఏఈతో మాట్లాడి శనివారం కొత్త పోల్స్ ఏర్పాటు చేయించిన విషయం విధితమే. తాజాగా ఆదివారం ఆ పోల్స్‌కు లైట్లు కూడా అమర్చించడం ద్వారా వార్డులో ఉన్న వెలుతురు సమస్యకు పరిష్కారం చూపినట్లయ్యింది. గతంలో చీకటి కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, ప్రస్తుతం లైట్లు ఏర్పాటు కావడంతో రాత్రి సమయంలో సౌకర్యంగా మారిందని స్థానిక వాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమస్యను గుర్తించి వెంటనే స్పందించిన కౌన్సిలర్ దండి రంగారావుకు ప్రజల నుంచి అభినందనలు వ్యక్తం అందుతున్నాయి.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి

**పూలమాల వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర**



ప్రజాపక్షం/సత్తుపల్లి: బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఆయన విగ్రహానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడైన బాబూ జగ్జీవన్ రామ్ దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. సామాజిక న్యాయం, వర్ణ వివక్ష నిర్మూలన కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కేంద్ర మంత్రిగా రక్షణ, వ్యవసాయం, కార్మిక రంగాల్లో సేవలందించి దేశ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. దళిత సాధికారత కోసం అమలు చేస్తున్న పథకాల వెనుక ఆయన ఆలోచన ప్రభావం ఉందన్నారు. దళిత బహుజనులకు అన్ని రంగాల్లో సమాన హక్కులు కల్పించినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని సండ్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అద్దంకి అనిల్, రఘు, వల్లభనేని పవన్, రామిశెట్టి కృష్ణ, వినుకొండ వెంకటేశ్వరరావు, వెదుళ్ళ నాగు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల పోరుబాట

### -దశలవారీగా ఉద్యమానికి సిద్ధం

**ప్రజాపక్షం/కారేపల్లి:** తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ నేతలు ప్రభుత్వంపై మరోసారి ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా పోరాటం చేపట్టాలని నిర్ణయించారు. పెండింగ్ బిల్లులు, డీఏలు, హెల్త్ కార్డులు, పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు వంటి ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈనెల 7న రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో తుది కార్యాచరణ ప్రకటించనున్నారు. లంచ్ టైంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు, రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని యోచిస్తున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు ఏళ్లుగా పెండింగ్‌లో ఉండటంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. డీఏ బకాయిలు, రూ 13వేల కోట్ల పెండింగ్ బిల్లులు, క్యాష్‌లెస్ హెల్త్ పథకం అమలు, ఓపీఎస్ అమలు వంటి డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని జేఏసీ డిమాండ్ చేసింది.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** భారత్ మాజీ ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఆదివారం జూలూరుపాడు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దెబ్బెందుల సాయికుమార్ ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ముందుగా జగజీవన్ రామ్ చిత్రపటానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ దళితులలో ఈ దేశానికి ఉప ప్రధాని కాగలిగిన వ్యక్తి దేశంలో 40 ఏండ్ల సుదీర్ఘ పార్లమెంట్రీయాన్, ఈ దేశ తొలి కార్మిక శాఖ మంత్రి భారత్ పాక్ యుద్ధ సమయంలో రక్షణ శాఖ మంత్రి గా దేశానికి విజయం ఆహార కొరత సమయంలో వ్యవసాయ శాఖ మంత్రి గా దళితులలో అత్యున్నత స్థానాలను అధిరోహించిన హీరో బాబు జగ్జీవన్ రామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు దెబ్బెందుల సాయికుమార్, మాజీ మండల అధ్యక్షులు కాకటి కృష్ణ, మంద బాబు, ఇసన్నపల్లి నాగరాజు, సృజన్, వెంకట్, కిరణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి



**ప్రజాపక్షం/వైరా:** వైరా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ 119వ జయంతి వేడుకలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పమ్మి అశోక్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పమ్మి అశోక్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, రాజకీయవేత్త వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన బాబుజీగా ప్రసిద్ధుడు. భారత పార్లమెంటులో 40 ఏళ్ల పాటు వివిధ మంత్రి పద వులు నిర్వహించడమే కాకుండా ఉప ప్రధానిగా వ్యవహరించారు. 1935లో అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో అతను కీలకపాత్ర పోషించాడు. 1937లో బీహార్ శాసనసభకు ఎన్ని కయ్యాడు. ఆ తర్వాత గ్రామీణ కార్మిక ఉద్యమాన్ని నిర్వహించారని అన్నారు. ఈ కార్యక్ర మంలో వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, పల్లపు కొం డలు, కొమరనేని కిరణ్, షేక్ అజీజ్, షేక్ బాషా, కాకాటి ఏసు తదితరులు పాల్గొన్నారు.

## 10వ వార్డులో కోతుల సమస్యకు చెక్

### కౌన్సిలర్ దేవజ్యోతికి కృతజ్ఞతలు తెలిపిన వార్డు ప్రజలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో గత కొంతకాలంగా ప్రజలను ఇబ్బంది పెట్టుతున్న కోతుల సమస్యను పరిష్కరించారు మున్సిపల్ చైర్మన్ రిహానా కమల్ పాషా, కౌన్సిలర్ మట్టా దేవజ్యోతి లు. గుంపులుగా సంచరిస్తున్న కోతులు స్థానికులను భయాందోళనకు గురిచేయడంతో పాటు ఇళ్లలోకి చొరబడి ఆస్తినష్టం కలిగిస్తున్నాయని నివాసితులు ఫిర్యాదు నేపద్యంలో ఆదివారం ఈ సమస్యను వార్డు కౌన్సిలర్ దేవ జ్యోతి స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ రిహన కమల్ పాషా దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గమనించిన ఎమ్మెల్యే తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బృందం చాకచక్యంగా కోతులను పట్టుకొని బోన్లలో బంధించింది. పట్టుబడిన కోతులను అటవీ ప్రాంతాల్లో సురక్షితంగా విడిచిపెడతామని అధికారులు తెలిపారు.చాలా రోజులుగా ఇబ్బందులు పడుతున్న తమ సమస్యకు పరిష్కారం చూపినందుకు వార్డు ప్రజలు ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## బిటి రణదేవ్ 36వ వర్ధంతి

**ప్రజాపక్షం/ బోనకల్ :** సిఐటియు వ్యవస్థాపక నాయకుడు కామ్రేడ్ బిటి రణదేవ్ 36వ ర్ధంతి వీర తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల భవన్లో సిఐటియు బోనకల్ మండల కన్వీనర్ గుగులోతు నరేష్ అధ్యక్షన జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు మాజీ డివిజన్ కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు కిలారి సురేష్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో మహిళా సంఘం డివిజన్ అధ్యక్షులు జొన్నలగడ్డ సునీత, సిఐటియు నాయకులు ఎస్కే బుజ్జి, సిలారు, వ్య.కా.సం మండల అధ్యక్షులు తెల్లాకుల శ్రీనివాసరావు, కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, యుటిఎఫ్ నాయకులు పిల్లలమర్రి అప్పారావు, గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు గుండు సైదులు కెపిఎస్ నాయకులు ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.

# నెల రోజుల పాటు పుస్తకాలతో కుస్తీ..!

- ఒక్కో పరీక్షకు నాలుగు రోజుల గ్యాప్
- పుస్తకాలు వదిలి సెల్‌ఫోనుకు అంకితం
- మందలిస్తే విసుక్కుంటున్న విద్యార్థులు
- ఫలితాలపై ప్రభావం పడుతుందని తల్లిదండ్రుల ఆందోళన



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** పదో తరగతే భవిష్యత్ చదువులకు పునాది. పై చదువులకు వెళ్లాలంటే ముందు పదో తరగతి పాస్ అవ్వాలి. ఈ పదోతరగతిని ఆధారం చేసుకుని ఇంటర్, పాలిటెక్నిక్ ఐటిఐ, ఆపై డిగ్రీ తోపాటు పోటీ పరీక్షలకు వెళుతుంటారు. అంతటి విశిష్టత, ప్రాముఖ్యత ఉన్న పదో తరగతి పరీక్షలు ఈ ఏడాది నెల రోజులపాటు కొనసాగుతున్నాయి. ఒక్కొక్క పరీక్షకు ఏకంగా నాలుగేసి రోజుల గ్యాప్ రావడంతో ఫలితాలపై ప్రభావం పడే అవకాశం ఉందని పలువురు చర్చిస్తున్నారు. దీంతో పాటు ఈ ఫలితాలు ఎలా ఉంటాయో అని తల్లిదండ్రులూ తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పరీక్ష మధ్య పరీక్షకు నాలుగు రోజుల సమయం ఉంది కదా అని విద్యార్థులు చాలా మంది రివిజన్‌ను వాయిదా వేస్తున్నారు. ఏ ఏడాది లేనంతగా ఈ సారి పరీక్షల మధ్య ఇత గ్యాప్ రావడం ఒక రకమైన ఆందోళనకు దారి తీస్తోంది. ఈ గ్యాప్ ఫలితాలపై ఖచ్చితంగా ప్రభావం చూపుతుందని తల్లిదండ్రులతో పాటు నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పుస్తకాలు వదిలి :** పరీక్షల మధ్య వ్యవధి ఉండటంతో విద్యార్థులు రేపు చదవొచ్చులే అంటూ సెల్‌ఫోన్లకు అంకితం అవుతున్నట్లు పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పుస్తకాలు పట్టుకుని చదువుకోవాల్సిన పిల్లలు పరీక్షలంటే భయం లేకుండా సెల్‌ఫోన్లలో ముఖం పెట్టడంతో తల్లిదండ్రుల్లో ఆందోళనతో పాటు కోపం కట్టలు తెంచుకుని వస్తోంది. గట్టిగా మందలిస్తే ఏం జరుగుతుందో అనే భయం కూడా మరో ప్రక్క వెంటాడుతోంది. ఇక పస్తుకాలు తీసి చదవండీ అంటూ మందలిస్తే కొందరు పిల్లలు తల్లిదండ్రులపై విసుక్కుంటున్నారు. ఇదిలా ఉండగా చాలా మంది బాలురు బ్యాట్లు పట్టుకుని క్రికెట్ గ్రౌండ్ల వెంట పరుగులు పెడుతున్నారు. ఎండా కొండా లేకుండా,తిండి తిప్పలు అనే అలోచన లేకుండా, పరీక్షలు ఉన్నాయనే కనీస భయం లేకుండా ప్రవరిస్తున్నారంటూ పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యకం చేస్తున్నారు. మరి కొందరు సెల్‌ఫోన్లలో గేమింగ్ యాప్‌లకు ఎడిక్ట్ అయిపోతున్నారు. పరీక్షలంటే భయం ఉన్నవాళ్లు ఇళ్ల వద్ద పుస్తకాలు పట్టుకుని కూర్చుని స్కోర్ చేసుకోవచ్చనే ఉద్దేశ్యంతో ఒకటికి పది సార్లు రివిజన్ చేసుకుంటూ సిద్ధ పడుతున్నారు.

**ప్రశాంతంగా సాగుతున్న పరీక్షలు :** మార్చి 14వ తేదిన ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 16వ తేది వరకు జరగనున్నాయి. ఇప్పటి వరకు మొదటి, రెండో లాంగ్వేజీ పరీక్షలతో పాటు, ఇంగ్లీష్, లెక్కలు, ఫిజిక్స్ పరీక్షలు పూర్తయ్యాయి. 7వ తేదిన బయాలజీ, 13న సోషల్, 15న ఓఎస్‌ఎస్‌సి/ఒకేషనల్ థీయరీ, 16న ఓఎస్‌ఎస్‌సి రెండో పేపర్ పరీక్ష జరగనుంది. దీంతో పదో తరగతి పరీక్షలు పూర్తి కానున్నాయి. ఏకంగా నెల రోజులకు పైగా పదో తరగతి పరీక్షల నిర్వహణ ఉండటంతో అటు విద్యార్థులతో పాటు, ఇటు తల్లిదండ్రులుకు కాస్త ఇబ్బందిగానే మారిందంటూ పలువురు ఉన్నతపాఠశాల విద్యా నిపుణులు చెబుతున్నారు.

# ఘనంగా ఈస్టర్ వేడుక

- భక్తిశ్రద్దలతో ప్రార్థనలు చేసిన భక్తులు
- క్రైస్తవ దేవాలయాల వద్ద సందడి





**ప్రజాపక్షం/కొత్తగూడెం :** జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు పునరుత్థానాన్ని స్మరించుకుంటూ ఆయా చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జిలాల్లోని ప్రధాన క్రైస్తవ ఆలయాలు అయిన సిఎస్ఐ, పెంతుకోస్తు, బైబిల్ మిషన్‌తో పాటు ఇతర డినామినేషన్ల, సొంత చర్చీలల్లో తెల్లవారు ఝామునుండే ప్రత్యేక ప్రార్థనలు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులతో కలిసి భక్తులంతా ఈ పండుగను అత్యత భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక గీతాలాపనలు, ప్రసంగాలు చేశారు. ఈస్టర్ పండుగ మనుష్యుల మధ్య ప్రేమ, క్షమ, ఆశను పెంపొందించే పండుగగా నిలుస్తుందని, ఇది ప్రపంచానికి శాంతిని, ఐఖ్యత సందేశాన్ని అందిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం క్రైస్తవ దేవాలయాల వద్ద సందడి వాతావరణం కనిపించింది. క్రిస్మస్ వేడుక తర్వాత క్రైస్తవులు జరుపుకునే మరో పండుగ ఈస్టర్. పిల్లా పాపలతో కుటుంబ సభ్యులు నూతన వస్త్రాలు ధరించి సంబురాలు చేసుకున్నారు.

**భద్రాచలం సిఎస్ఐ చర్చిలో :** భద్రాచలం క్రీస్తు దేవాలయంలో పాస్టర్ విజయ్ కుమార్ ప్రత్యేక సందేశాన్ని అందజేసారు. ఏసుక్రీస్తు సిలువలో మరణించిన తర్వాత మూడవ రోజు తిరిగి లేస్తారని క్రైస్తవల విశ్వాసం. దీనిని పురస్కరించుకుని ఏసు క్రీస్తు మరణాన్ని జయించి లేచిన రోజును ఈస్టర్‌గా జరుపుకుంటారని ఆయన తెలిపారు. సర్వమానవాళి పాపప రిహారార్ధ బలియాగంగా ఏసు సిలువ మరణం పొందారని, మానవమాత్రునిగా ఆయన మరణం పొందినప్పటికీ దేవాది దేవుని కుమారినిగా ఆ మరణాన్ని జయించి లేచారని తెలిపారు. ఏసు చూపిన ప్రేమ, దయా, జాలి కరుణ అందరు కలిగి ఉండాలని, పొరుగువారిని గౌరవిస్తూ సోదరభావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు రితీష్ రెడ్డి, వైడి ప్రసాదరావు, జోసఫ్, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ఉపసర్పంచ్‌పై విచారణకు రంగం సిద్ధం



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండల పరిధిలోని అబ్బుగూడెం గ్రామ ఉప సర్పంచ్‌పై గ్రామ ప్రజలు చేస్తున్న ఫిర్యాదులు ఆరోపణల విషయంలో ప్రజాపక్షం దినపత్రికలో వస్తున్న వరుస కథనాలకు అధికారులు స్పందించడం జరిగింది. ఓ వైపు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులను, ప్రభుత్వ భూములను ప్రతిష్టాత్మకంగా తీసుకొని హైడ్రా పేరుతో కాపాడుకుంటూ వస్తుంటే అబ్బుగూడెం గ్రామంలో మాత్రం ఇందుకు విరుద్ధంగా అధికారులు ప్రభుత్వ ఆసులైనా, ప్రభుత్వ భూములైనా, తమకు పట్టవన్నట్టుగా తమకేమీ సంబంధం లేదన్నట్టు పత్రికల్లో సైతం కథనాలు వస్తున్న స్పందించకపోవడం ప్రజల్లో తీవ్ర విమర్శలకు దారితీస్తుంది. ఈ నేపథ్యంలో అబ్బుగూడెం గ్రామంలో కొందరు వ్యక్తులు ఉప సర్పంచ్‌పై సుమారు 8 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టాలు చేసుకున్నారు. ఈ విషయంపై మండల అధికారికి ఫిర్యాదు చేశారు. అదే విధంగా పత్రికల ద్వారా ప్రజలకు తెలియజేశారు. ఈ కథనంపై ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటం, కనీసం పత్రికల్లో వార్త వచ్చింది కదా ఒక్కసారైనా వాస్తవాలు ఏమిటో చూద్దాం అన్న కనీస ఆలోచన లేకుండా వ్యవహరిస్తున్నారని, గ్రామస్తులు కొంత మంది ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై గ్రామస్తులు ప్రజాపక్షముకు తెలియజేయగా, అన్నపురెడ్డిపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్ జగదీశ్వరిని వివరణ కోరడం జరిగింది. ఆమె ఈ సమస్యపై స్పందిస్తూ అబ్బుగూడెం గ్రామ ప్రజలు ఈ విషయంపై ఫిర్యాదు చేయడం జరిగిందని అదే విధంగా ఉన్నతాధికారులు ఆర్డీవో విచారణ జరిపి పూర్తి సమాచారాన్ని అందించాలని ఆదేశాలు జారీ చేశారని, వీలైనంత త్వరగా విచారణ జరిపి ఉన్నత అధికారులకు సమాచారం అందిస్తామని పత్రిక ముఖంగా తెలియజేశారు. ఇదిలా ఉండగా అబ్బుగూడెం గ్రామ ప్రజలు మాత్రం ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేసి ప్రభుత్వ భూములను గిరిజనులకు అప్పగించాలని ఈ విషయంపై రాష్ట్ర జాతీయ ఎస్టీ కమిషన్ ద్వారా ఉన్నత స్థాయి అధికారులకు త్వరలోనే ఫిర్యాదు చేస్తామని తెలియజేస్తున్నారు.

# ఏం కొనేటట్లు లేదు.. ఏం తినేటట్లు లేదు..!

- చుక్కలనంటిన ధరలు
- కమర్షియల్ 310. డొమెస్టిక్‌కు 30/లు పెంపు
- పెరిగిన గ్యాస్ బండ, పేదోల్ల గుండెల్లో గుదిబండ
- పట్టించుకోని ప్రభుత్వాలు





**ప్రజాపక్షం/పాల్వంచ :** అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు తమ ఆధిపత్యాన్ని చాటుకోవటం కోసం ఇరాన్‌తో చేస్తున్న యుద్ధం సామాన్య, పేద ప్రజల, అన్ని వర్గాల బతుకులను చిన్నాభిన్నం చేస్తున్నది. కంప్రెస్డ్, న్యాచురల్ (సిఎన్‌జి) గ్యాసు కొరతతో 33 నుండి 156కు పెరిగిన ధరలతో ఆటోవాలాలు ఢీలా పడిపోతున్నారు, డీజిల్, పెట్రోల్ కొరతతో నిత్యావసర సరుకులు కొండెక్కాయి. ఆటోలు నడుపుకుండా జీవనాన్ని కొనసాగిస్తున్న వారికి తమ ఆటో కిస్తీలు చెల్లించడం భారంగా మారింది. అక్కడెక్కడో జరిగే యుద్ధం ప్రభావంతో నూనె, ఉప్పులు, ఇతరత్రా నిత్యావసర సరుకుల ధరలు, గృహావసరాల గ్యాసు, వాణిజ్య గ్యాసు ధరలకు రెక్కలొచ్చాయి. పెరిగిన గ్యాసు ధరలు పేదల పాలిట గుదిబండగా మారాయి. డొమెస్టిక్ గ్యాసుకు 60/లు పెరిగింది. మరోవైపు కమర్షియల్ గ్యాసు ధర నెలలో ఏకంగా 310/లు పెరిగింది. సరఫరా చేసే వారికి అదనంగా మరో 30/లు చెల్లించాల్సివస్తున్నది. అయినా దొరుకుడే భాగ్యమన్నట్లుగా ఉంది. అర్జంటు అవసరమైతే బ్లాకులో 1500/ల వరకు అవుతున్నది. అదే కమర్షియల్ గ్యాసు బ్లాకులో కొనాలంటే తక్కువలో తక్కువగా సుమారు 4000/లు ఉంది. వీటి ధర భరించలేక చిరు హోటల్ళు, నూడిల్స్ పాయింట్లు, టీ కొట్లు మూతవేశారు. వీటపై ఆధారపడిన వందలాది మంది ఉపాధి కోల్పోయారు. ఇతర దేశాల నుండి ముడి సరకు రావటం లేదని సన్‌ఫ్లవర్, పామాయిల్ వంటి వంట నూనెల ధరలు కనీసం 30 నుండి 50 రూపాయల వరకు పెరిగాయి, పనిలో పనిగా యుద్దాన్ని సాకుగా చూపిస్తూ కంది, పెసర, మినప, మైసూర్, శనగ పప్పులకు కృత్రిమ కొరత సృష్టించిన బడాబాబులు ధరలను పెంచేశారు. పెరిగిన ధరలతో వంటింట్లో మంటలు చెలరేగుతున్నాయి.మంచినూనెలు మంటెక్కిస్తున్నాయి. ఉప్పు, పప్పుల ధరలు కుతకుతలాడుతున్నాయి. గ్యాసు సిలిండర్ల దందా ఆగమాగం చేస్తున్నది. ఏం కొనేటట్లు లేదు, ఏంతినేటట్లు లేదనే రీతిగా పేద మధ్య తరగతి ప్రజానీకం తీవ్ర ఇబ్బందులతో సతమతమవుతున్నారు. మూసిన చిరు హోటల్‌లో యాజమానితో పాటుగా మరో ముగ్గురు మనుషులు అవసరం ఉంటుంది. ఈ లెక్కన పాల్వంచలో సుమారు వేయి మందికి పైగా తమ ఉపాధిని కోల్పోయి రోడ్డున పడ్డారని తెలుస్తోంది. నిత్యావసర సరుకుల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకుతున్నాయి. పప్పులు, వంటనూనె, బియ్యం, కూరగాయలు ధరలు ఆగకుండా జంపయ్యాయి. ఆకాశాన్ని తాకుతున్న ధరలతో మధ్య, పేద తరగతి ప్రజలు బేజారువుతున్నారు. ఇదేమని అడిగితే యుద్ధం వలన అన్ని సరుకుల ధరలకు రెక్కలొచ్చాయని అంటున్నారు. పాలక ప్రభుత్వాలు పట్టించుకోక పోవటంతో కార్పోరేట్ సంస్థలు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయి. దీనితో ధరలు మండిపోతున్నాయి. ఇకనైనా పెరిగిన ధరలను అదుపులోకి తీసుకురావాలని ప్రజలు కోరుచున్నారు.

### పెరిగిన ధరలను తగ్గించాలి...

### సిపిఐ మండల కార్యదర్శి వీసంశెటి



యుద్ధం కారణంతో పెంచిన గ్యాసు ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు డిమాండ్ చేశారు. అమెరికా చేస్తున్న యుద్దాన్ని కారణంగా చూపెడుతూ కార్పోరేట్ వర్గాలు వంట నూనెలు, పప్పులు, నిత్యావసర సరుకుల ధరలను పెంచాయని ఆరోపించారు. పాలక ప్రభుత్వాలు పట్టించుకోక పోవటంతో ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయన్నారు. దీనితో పేద, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు పట్టించుకొని ధరల పెరుగుదలకు కళ్ళెం చేసి తగ్గించాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/ మధిర :** ఆదర్శనేత, సంఘ సంస్కర్త, మాజీ ఉప ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్‌రామ్ 119వ జయంతిని మధిరలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన జయంతి వేడుకల్లో మాజీ జెడ్పిచైర్మన్ లింగాల కమల్‌రాజు పాల్గొని ఆయనచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా బిజెపి పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్దనున్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పిఆర్‌టియు, టిఎస్ యూటిఎఫ్ ఉపాధ్యాయసంఘాల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కార్యాలయం వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వతంత్ర్య భారతదేశంలో భారత జాతి గర్వించేలా భారత రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. అంతరానితనానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించి అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. దేశ ఉప ప్రధానిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో బిఆర్ఎస్, బిజెపి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పిఆర్‌టియు, టిఎస్‌యూటిఎఫ్ సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

# తమ్మినేని ట్రస్ట్ వైద్య సేవలు అమోఘం

- ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి ప్రశంస



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** పది సంవత్సరాలుగా ఎటువంటి విరామం లేకుండా తమ్మినేని సుబ్బయ్యట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మెడికల్‌క్యాంప్ సేవలు అమోఘమని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ చీకటి భారవి అన్నారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని తమ్మినేని సుబ్బయ్యభవన్‌లో ప్రతి నెల మొదటి వారం నిర్వహిస్తున్న క్యాంప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేవలం రూ.100కే నెలకు సరిపడా బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు మందులు అందజేయడం గొప్ప విషయమన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా పేద ప్రజలు ఆరోగ్యంగా జీవించాలనే ఉద్దేశంతో మందులు అందిచడం అభినందనీయం అన్నారు. ఇలాంటి సేవలను సీపీఎం, తమ్మినేని సుబ్బయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో మరింత విస్తరించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం మెడికల్ క్యాంప్ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పాలేరుడివిజన్ కార్యదర్శి బండి రమేష్, ఏదులాపురం మున్సిపాలిటీ, రూరల్ మండల కార్యదర్శులు ఊరడి సుదర్శన్‌రెడ్డి, వడ్లమూడి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్, వైద్యులు పిల్లమర్రి సుబ్బారావు, పొన్నం వెంకటరమణ, నిర్వాహకులు ఇంటూరి అశోక్, నందిగామ కృష్ణ, తోట పెద్ద వెంకట్ రెడ్డి, గోగుల నాగరాజు, పుచ్చకాయల నాగేశ్వరరావు, నాగచైతన్యరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 14న అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని ఈనెల 14న మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించాలని టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగా రాంబాబు పిలుపునిచ్చారు. ఆదివాసీ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో పాయం రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా ద్వారా చైతన్యం సాధించి, హక్కుల కోసం పోరాడుతూ ఐక్యంగా నిలవాలని సూచించారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాన్ని అంకితం చేసిన అంబేద్కర్ ఆశయాలను సమాజంలో బలంగా స్థాపించాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యతగా పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే దేశాభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని చెబుతూ, ప్రజలు, యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని జయంతిని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో గొగ్గెల గాదే రాజు, కొమరం వెంకట కృష్ణంరాజు, జోగ సర్వేశ్, గొగ్గల వినోద్, సాగబోయిన సురేష్, ఏడూళ్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఈస్టర్ పండుగ



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో ఏసుక్రీస్తు పునరుద్దరణ సందర్భంగా ఈస్టర్ దేను ఘనంగా నిర్వహించారు. మండలంలో క్రైస్తవులందరూ గుడ్ ఫ్రైడ్ నుండి ఆదివారం వరకు చిన్న పెద్ద భేదం లేకుండా అందరూ విశ్వాసంతో ఉపవాసాలు ఉంటూ భక్తిశ్రద్ధలతో క్రీస్తులను ఆరాధించడం జరుగుతుంది. మండల కేంద్రంలో ఉన్నటువంటి ఒలీవ చర్చి నందు పాస్టర్ మరియరాజు, బెతస్థా ప్రార్ధన మందిరం నందు రెవరెండ్ పాస్టర్ తీతూ, రెవరెండ్ సజీవం వీరందరూ మందిరాలలో క్రీస్తు శుభసందేశమును ప్రబోధించడం జరిగింది. యేసుక్రీస్తు సర్వ మానవాళి సంరక్షణ కోసం వారి పాపములను కడుగుట కొరకు తన ప్రాణమును పణంగా పెట్టి మూడవ నాడు తిరిగి లేచిన సందర్భంగా ఈస్టర్ దే ను జరుపుకోవడం జరుగుతుందని ఏసుక్రీస్తు అడుగుజాడల్లో నడిచి మానవాళి ప్రపంచ శాంతినీ కోరుతూ జీవితాలను వెలుగుమయం చేసుకోవాలని విశ్వాసులకు తెలియజేశారు. ఈకార్యక్రమంలో సంఘ పెద్దలు, సంఘ సభ్యులు, సంఘ కాపరులు విశ్వాసులు పాల్గొన్నారు.

## ఘనంగా ఈస్టర్ పండుగ



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలో ఈస్టర్ పండుగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున నుంచే ప్రార్థనా మందిరాలు విశ్వాసులతో కిటకిటలాడాయి. ప్రత్యేక ప్రార్థనలు, కీర్తనలు, ఆరాధనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మండలంలోని చర్చిలలో సంఘ కాపరులు క్రీస్తు పునరుద్దాన మహిమను విశ్వాసులకు వివరించారు. ఈసందర్భంగా విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కుటుంబ సభ్యులతో కలిసి దేవునికి కృతజ్ఞతలు తెలిపారు. పండుగను పురస్కరించుకుని విశ్వాసులు ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ సోదరభావాన్ని చాటుకున్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** బాబు జగజ్జీవన్ రామ్ జయంతిని అశ్వాపురం మండలంలో బాబు జగజ్జీవన్ రామ్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసంపల్లి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో నాయకులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ బాబు జగజ్జీవన్ రామ్ సామాజిక సమానత్వం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను యువత కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు మిర్యాల వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ నాయకులు మిరియాల బాలకృష్ణ, మురికిపూడి అశోక్, కాళ్ళ వెంకటేశ్వర్లు, చుంచు ప్రవీన్, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని యువకుడి మృతి

**ప్రజాపక్షం/పాల్వంచ :** కారు ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ పాల్వంచ పరిధి 34వ, డివిజన్ కార్పోరేటర్ కరకవాగుకు చెందిన భట్టు విజయలక్ష్మి, తన కుమారుడు విక్కి ( 18 ) తో కలిసి బైక్‌పై పాల్వంచలో జరుగుతున్న ఓ కార్యక్రమానికి హాజరు కావటానికి వెళుతున్నారు. ఈ క్రమంలో పాల్వంచ పోలీస్ స్టేషన్ సమీపంలోకి రాగానే వెనుక నుండి వచ్చిన కారు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీనితో విక్కి కి గాయాలై తీవ్ర రక్తం స్రావం జరిగింది. కార్పోరేటర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను హుటాహుటిన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా విక్కి మృతి చెందాడు. గాయపడ్డ విజయలక్ష్మిని మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెం తరలించారు.

# ఆడిట్‌లో బయటపడని అవినీతి..!




-ఖమ్మంలో విందు పార్టీ?
-పేరుకే ఆడిట్... అంతా గప్‌చుప్
-అవినీతి బయటపడకుండా లోపకారిక ఒప్పందాలు

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో జరిగిన ఆడిట్‌లో అవినీతి బయటపడిన సందర్భాలు కనిపించడం లేదు. ఇటీవల కాలంలో మున్సిపాలిటీలో జరిగిన అవినీతి దందాలో ఆడిట్ అధికారులు కూడా భాగస్వాములు అయ్యారని చెప్పవచ్చును. ఎందుకంటే గత కొద్ది రోజుల క్రితం వైరా మున్సిపాలిటీలో ఆడిట్ కొనసాగింది. ఆడిట్ అధికారులు వచ్చామా ఆడిట్ చేసామా అధికారులను సేవ్ చేసామా అనే పాత్ర పోషించారు అనే వాదన వినిపిస్తుంది. ఆడిట్ అంటే ఏం జరిగింది, ఎంత ఖర్చు చేశారు. ఏ విధంగా ఖర్చు చేశారు దానికి సంబంధించిన సంబంధిత బిల్లును సక్రమంగా ఉన్నాయా, బిల్లులు ఒరిజినలా నకిలీ అనేది కూడా తెలియాల్సిన బాధ్యత ఆడిట్ అధికారులపై ఉంది. కాని ఆడిట్ అలాంటి అధికారులు ఎక్కడా కూడా నిజాయితీగా వైరా మున్సిపాలటీలో ఆడిట్ చేయలేదని వాదన వినిపిస్తుంది. మున్సిపాలిటీలో కొన్న వస్తువులను పదేపదే మరల కొనుగోలు చేస్తూ వచ్చారు. ఒక వస్తువును రెండుసార్లు ఎందుకు కొన్నారు. ఏ విధంగా కొన్నారు, దేనికోసం కొన్నారు, కొన్ని నెలల వ్యవధిలోనే ఎందుకు కొనుగోలు చేశారు, అనే దానిని అధికారులు నిగ్గు తేల్చలేదు. ఇప్పటికే వైరా మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అవినీతి జరిగింది అనే ఆరోపణలు బహిరంగంగానే వినిపించాయి. మరి ఆ అవినీతి ఏ విధంగా జరిగింది ఎందుకు జరిగింది అనే దానిని ఆడిట్ అధికారులు ఎందుకు నీకు తేల్చలేకపోయారు. ఆ కంపెనీ నుంచి వస్తువులను ఏ విధంగా కొనుగోలు చేశారు. ఆ కంపెనీ వచ్చిన బిల్లులో వాస్తవం ఎంత అనేది కూడా నిగ్గు తేల్చలేకపోయారు. ఆడిట్ అధికారులకు ఖమ్మంలో జరిగిన విందు పార్టీ ఏంటి, ఆ విందు పార్టీలో ఎవరెవరు అధికారులు పాల్గొన్నారు. ఆడిట్ అధికారులు వైరా మున్సిపాలిటీకి వచ్చి ఆడిట్ చేసిన వారిలో నిజాయితీ తేల్చింది ఏమిటి? అవినీతి జరగలేదా, అవినీతి వారికి కనిపించలేరా, తప్పుడు బిల్లులు కనిపించలేదా, ఆడిట్‌కి వచ్చిన అధికారులకు రాస మర్యాదలు ఎందుకు, ఆడిట్ అధికారులు ఒకచోట ఆడిట్ వచ్చాము అంటే వారి పని నిబద్ధతతో ఎలాంటి స్వార్థం లేకుండా ఎలాంటి రాసమర్యాదలకు లోనుకాకుండా ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజాధనాన్ని కాపాడే విధంగా ఆడిట్ చేయవలసి ఉంది. మరి ఆ విధంగా అధికారులు ఆడిట్‌చేశారా. వైరా మున్సిపాలిటీలో వరస అవినీతి ఆరోపణలు పదేపదే వెల్లువెత్తుతున్నాయి. అలాంటి సమయంలో ఆడిట్ అధికారులు ఎలాంటి నివేదిక అందించారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు వైరా మున్సిపాలిటీలో జరిగిన ఆడిట్‌లో నిజానిజాలు ఎంత, అసలు ఏం జరిగింది అనే నివేదికను పరిశీలిస్తే పూర్తిస్థాయిలో వాస్తవాలు బయటకు వస్తాయి, అవినీతి అధికారుల బాగోతం బయటపడుతుంది.

## సాయిబాలాజీ కోల్డ్‌స్టోరేజి బాధిత రైతులకు సత్వర న్యాయం చేయాలి



**ప్రజాపక్షం/ మధిర :** సాయిబాలాజీ కోల్డ్ స్టోరేజి అగ్ని ప్రమాద బాధిత రైతులకు సత్వరమే పరిహారం అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు బాధిత రైతులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ దురదృష్టవశాత్తూ సంభవించిన సాయిబాలాజి కోల్డ్‌స్టోరేజి అగ్ని ప్రమాదం వల్ల రైతులు తమ సర్వస్వాన్ని పోగొట్టుకున్నారని అన్నారు. మిర్చి పంట సాగు చేయడం అంటే నిరంతరం తెగుళ్లతో ప్రకృతితో మార్కెట్‌లో యుద్ధం చేయాల్సి వస్తుందన్నారు. అన్నింటిని దాటుకుని పంట చేతికి వస్తే వచ్చిన పంటను స్టోరేజి నందు భద్రపరిస్తే అగ్ని ప్రమాదానికి దగ్ధమైన విషయం రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందని అన్నారు. అప్పుల ఊబిలో ఉన్న మిర్చి రైతులు ఆశలను ఈ అగ్ని ప్రమాదం బుగ్గిపాలు చేసిందని అన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీ జాప్యం చేయకుండా వెంటనే నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వేగవంతంగా పారదర్శకంగా నష్టపరిహారం అందించాలని కోరారు. అనంతరం బాధిత రైతుల పక్షాన పోరాడేందుకు 30మందితో కూడిన కమిటీని ఎన్నుకోవటం జరిగింది. కమిటీ కన్వీనర్‌గా దివ్వెల వీరయ్య, కో కన్వీనర్‌గా గువ్వల సీతారామిరెడ్డి ఎన్నుకున్నారు. బాధిత రైతుల పక్షాన కమిటీ పని చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు మడిపల్లి గోపాలరావు, డివిజన్ కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సిపిఐయు జిల్లా నాయకులు శీలం నర్సింహారావు, గువ్వల సీతారామి రెడ్డి, బాధిత రైతులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలం, వీఎం బంజర్ గ్రామంలోని సప్తపది ఫంక్షన్ హాల్లో ఆదివారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ 98 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి తల్లిదండ్రులకు ఆడపిల్ల పెళ్లి భారం కాకూడదని కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తూ మూడు నెలల లోపే ప్రభుత్వం తల్లిదండ్రులకు అందిస్తుందని తెలిపారు. వైద్య ఖర్చు నిమిత్తం పేదవానికి ఆసరాగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సకాలంలో అందిస్తుందని అన్నారు. అంతే కాకుండా తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని ప్రతి కుటుంబం మూడుకు పైన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని ఇప్పటికే నిరూపించిందని ప్రజలు గ్రహించాలని సూచించారు. పేద విద్యార్థులకు పౌష్టిక ఆహారం, ఇంటర్ విద్యార్థులకు బ్రేక్ఫాస్ట్ అందిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని అన్నారు. పేదవాడి కోసం పనిచేసే ప్రభుత్వాన్ని, పార్టీకి అండగా నిలబడాలని ఆమె కోరారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం లబ్ధిదారులకు స్వయంగా చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వీరభద్ర నాయక్, ఎంపీడీవో అన్నపూర్ణ, మండల పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, ఏఎంసీ ఉప చైర్మన్ రాజ బోయిన కోటేశ్వరావు, మాచినేని రాజబాబు, భూక్యా ప్రసాద్, భానోతు పాప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యాదవ ప్రజాప్రతినిధుల సన్మాన మహోత్సవం



**ప్రజాపక్షం/కారేపల్లి:** అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన యాదవ ప్రజాప్రతినిధుల సన్మాన మహోత్సవంలో జూబ్లీహిల్స్ ఎంఎల్‌ఎ వల్లల నవీన్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి మండల యాదవ మహాసభ నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఖమ్మం గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య యాదవ్, యువజన అధ్యక్షులు చిత్తారి సింహాద్రి యాదవ్, అడ్డగోడ ఐలయ్య యాదవ్, బి రమేష్ యాదవ్, మారబోయిన రామచంద్రయ్య(రాము)యాదవ్, యెనిక రవీందర్(రవి)యాదవ్, దేగల ధనలక్ష్మి ఉపేందర్ యాదవ్, పల్లపాటి రామకృష్ణ యాదవ్, ఆవుల సత్యనారాయణ యాదవ్, నన్నేబోయిన ఉపేందర్ యాదవ్, కదారి వెంకట్ యాదవ్, మేకల కుమారస్వామి యాదవ్, సీటు మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## తల్లాడలో ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి




**ప్రజాపక్షం/ తల్లాడ :** భారత మాజీ ఉపప్రధాని, గొప్ప సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ 119వ జయంతిని పురస్కరించుకుని తల్లాడలో ఆదివారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశ సేవ, సామాజిక న్యాయం కోసం చేసిన కృషిని స్మరించుకుంటూ వక్తల ప్రసంగించారు. బాబూ జగ్జీవన్‌రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని వక్తలు పిలుపునిచ్చారు. అదేవిధంగా తల్లాడ మండలంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా వేడుకలను పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గోపికి ఘనసన్మానం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డుకు చెందిన కొండపల్లి వెంకన్న దేవి దంపతుల కుమారుడైన గోపి(భారత్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్)లో ఉద్యోగం సాధించడం పట్ల వైరా మున్సిపాలిటీ ఏడో వార్డు కౌన్సిలర్ ఫనితి సైదులు గోపిని అభినందిస్తూ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫనితి సైదులు మాట్లాడుతూ గోపి చాలా కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించడం ఏడో వార్డుకు గర్వకారణం అని కొనియాడారు. యువత గోపిని ఆదర్శంగా తీసుకొని చదువుకొని తల్లిదండ్రుల ఆశయాలను ఆకాంక్షలను నెరవేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోటు మధు, చెరుకూరి శ్రీను, సరిపుడి కోటేశ్వరరావు, వెంకన్న, వెంకటేశ్వర్లు, నబీ, మీరా, నాగార్జున, యాకూబ్, పాషా, రేచర్ల వెంకటేష్, నాగుల్‌మీరా, అబ్బాస్, సల్మాన్, బుజ్జిబాబు, జ్యోతిబాస్,సాగర్, అబ్బర్, బ్లెస్సన్ ప్రసాద్, అభిషేక్, అరవిందు సాయి కిరణ్ నాయుడు ఆనంద్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత బట్టలు పంపిణీ



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలీటీ :** మధిర పట్టణంలోని ప్రముఖ సంఘ సేవకులు, ఆశమిత్ర లంకా కొండయ్య నివాసం వద్ద ఆదివారం మహాత్మాగాంధీ ఉచిత పాత బట్టల కేంద్రం ద్వారా అవసరమైన నిరుపేదలకు దాతల సహకారంతో ఉచిత బట్టలను పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధిర పట్టణానికి చెందిన న్యాయవాది కట్టా పూర్ణచందర్ రావు, ప్రముఖ వ్యాపారి బత్తుల వెంకటేవ్వరరావు, రిటైర్డ్ ఉద్యోగి యంద్రపల్లి పద్మావతి తదితరుల దాతల సహకారంతో అందించిన పాతబట్టలను లంకా కొండయ్య ఆధ్వర్యంలో నిరుపేదలకు పంపిణీ చేయటం జరిగింది. ఈసందర్భంగా లంకా కొండయ్య మాట్లాడుతూ లంకా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తున్న దాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లంకా సేవా ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండలంలో భారత మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని పెద్దగోపవరం, పెగళ్ళపాడు గ్రామాల్లో జరిగిన జయంతి వేడుకల్లో కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ప్రతిఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మధిర ఏఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు, జిల్లా నాయకులు కోట రాంబాబు, కూరపాటి ప్రభాకర్, నవశకం ఫౌండర్ మేకల రమేష్, బొబిళ్ళపాటి బాబురావు, మైనార్టీ సెల్ అధ్యక్షులు జానీ బాషా, చొప్పకట్లపాలెం సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మండల నాయకులు మారాబత్తుల సక్కుర్తిశ్యామ్, మోహన్‌రావు, మొగునూరి మోహన్, మారాబత్తుల ముత్యాలరావు, బాబురావు, డేవిడ్, రూబెన్, పుల్లయ్య, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరులో ఘనంగా ఈస్టర్ వేడుకలు





**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. కల్లూరు పెద్ద కోరుకొండి విచార ణల పరిధిలో గల కతోలిక క్రైస్తవులు పండుగను ఘనంగా శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మత గురువులు వినయ్ కుమార్ రెడ్డి, సురేష్ జోషిలు బోధిస్తూ క్రీస్తు ప్రభువు మరణించిన మూడో రోజున ఆయన మరణమును జయించి ఉత్తముడు అయినాడని, ఈ సంఘటన మరణించిన ప్రతివారికి నిత్యజీవము కలదు అను సత్యమునకు బలము చేకూర్తుంది అన్నారు. క్రీస్తు ప్రభువు పరలోక భూలోకమునకు రాజు అని తేటతెల్లమ్ చేస్తుంది అని బోధించారు. ఈ కార్యక్రమంలో మత గురువులు తోపాటు కతోలిక క్రైస్తవులు, కన్య స్త్రీలు, ఉపదేశకులు, సంఘ పెద్దలు, చిన్న కోరుకొండి, వెంకటాపురం, పెద్ద కోరుకొండి, చెన్నూరు, ఎర్రబోయినపల్లి క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల బాంధవుడు జగ్జీవన్ రామ్



- సమ సమాజ స్థాపనలో ఆయన పాత్ర చిరస్మరణీయం
- ఆయన ఆశయసాధనపై కృషి చేయాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** అణగారిన వర్గాల బాంధవుడు బాబూ జగ్జీవన్ రామ్ అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా అంతా నడుచుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, పాల్వంచ బస్టాండ్ సెంటర్‌లో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జయంతి వేడుకలకు ఆయన ముఖ్యాతిధిగా హాజరయ్యారు. తొలుత జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసిన పాషా నివాళ్లర్పించారు. అనంతరం జరిగిన సభల్లో బాబూజీ స్ఫూర్తితో నేడు బహుజన వర్గాలకు రాజకీయ అధికారం లభిస్తోందన్నారు. సమ సమాజా స్థాపన ఆయన పాత్ర చిరస్మరణీయని కొనియాడారు. సామాజిక సమానత్వం కొసం జగ్జీవన్ రామ్ చేసిన కృషిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని, అప్పుడే ఆయన ఆశయ సాధన జరుగుతుందని, అదే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. దేశ ఉప ప్రధానిగా పారదర్శకమైన పాలన అందించిన దిశాలీ అని, హరిత విప్లవంలో దేశ ఆహారం భద్రతకు బలమైన బాటలు వేశారని గుర్తు చేశారు. దళిత బాంధవుడైన ఆయన అడుగుజాడల్లో నడవాల్సిన బాధ్యత నేడు ప్రతొక్కరిపై ఉందని ఆయన స్పష్టం చేశారు. పేదల అభ్యున్నతి కోసం ఆయన పడిన తపన నేటి తరానికి దిక్చూ అని సాబీర్ పాషా వివరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ దాసరి శ్రీను, కో కన్వీనర్లు పరమేష్, వేల్పుల భాస్కర్, చెదలవాడ సూరి, నిర్మల, కమిటీ నాయకులు కూసపాటి శ్రీనివాస్, మద్దెల శివకుమార్, మందా హన్మంతు, బొమ్మెర శ్రీను, మధుసూదన్, కంచర్ల జమలయ్య, పోలమూరి ధనలక్ష్మి, బరిగెల భూపేష్, హిమశ్రీ, పడాల ఆకాంక్ష,శివ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యంతో నూతన శిఖరాలు అధిరోహించాలి

గౌతమీ కాన్సెప్ట్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలో
తుంబూరు దయాకర్ రెడ్డి





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** విద్యార్థులు నూతన శిఖరాలు అధిరోహించాలి. విద్యార్థి దశ మన జీవితానికి పునాది వంటిది. ఈ దశలో ఏర్పడే అలవాట్లు భవిష్యత్తును నిర్ణయిస్తాయి. అందుకే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని ముందుకు సాగాలి అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యక్తిగత సహాయకులు తంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. పిండిప్రోలు గౌతమీ కాన్సెప్ట్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యక్తిగత సహాయకులు తుంబూరి దయాకర్ రెడ్డి, తో కలిసి మాజీ జడ్పిటిసి సభ్యులు బెల్లం శ్రీనివాస్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యక్రమం ముఖ్యఅతిథి గా హాజరైన తంబూరి దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, పోటీ ప్రపంచానికి అనుగుణంగా స్థానికంగా విద్యార్థులకు, కార్పోరేట్ స్థాయి విద్యను అందిస్తూ పూర్తిస్థాయి మౌలిక వసతులతో నూతన ఆవిష్కరణలతో విద్యాసంస్థ నిర్వహిస్తున్న యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. అనంతరం మాజీ జెడ్పిటిసి సభ్యులు బెల్లం శ్రీనివాస్ మాట్లాడుతూ. విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలో రాణించాలన్నారు. విద్యార్థుల చదువు విషయంలో తల్లి దండ్రులు జాగ్రత్త వహించాలని, విద్యార్థులు సోషల్ మీడియాకు బానిస కాకుండా చదువుపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి అన్నారు, విద్యార్థుల భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్న, ఉన్నత స్థాయిలో ఉండాలన్న, ఉపాధ్యాయులు చెప్పే పాటలతోపాటు, తల్లిదండ్రుల పెంపకం చాలా ముఖ్యం అని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నూతన సాంకేతికతను రంగరించి సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలోపాఠశాల కరస్పాండెంట్ ఉడుగు ఉపేందర్, పాఠశాల డైరెక్టర్ కాంపాటి బాబు రావు, పాఠశాల ప్రిన్సిపల్ ఉడుగు అప్పారావు, అధ్యాపకం బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా క్రీస్తు పునరుద్దాన పండుగ



-రెవ. ఫాదర్ కృప చారి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు
-వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన
సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి అప్పారావు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఏసుక్రీస్తు 40 రోజులు శ్రమలు అనుభవించి మనుషుల అన్యాయపు తీర్పుకు సిలువపై మరణం పొంది, మూడు రోజుల తర్వాత మరల సమాధి నుండి సజీవంతో లేచారు అనే బైబిల్ వాక్యం అనుసరించి ప్రపంచ క్రైస్తవులు నిర్వహించే అతిపెద్ద పండుగ క్రీస్తు పునరుద్దాన పండుగ (ఈస్టర్). ఈ పండుగ వేడుకలను మండల పరిధిలోని కిష్టారం గ్రామం అంబేద్కర్ నగర్ కాలనీ తిరు హృదయ దేవాలయంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకను విచారణ గురువులు రెవ. ఫాదర్ కృపాచారి ప్రత్యేక ప్రార్థనలతో ఆధ్యాత్మికంగా నడిపించారు. ఈ వేడుకలో సంఘంలోని యువతి యువకులు క్రైస్తవ భక్తి గీతాలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి అప్పారావు, ఉప సర్పంచ్ శీలం నాగరాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చారిత్రక ఆధారాలతో క్రీస్తు మరణించి తిరిగి లేచాడనే విశ్వాసంతో గ్రామ ప్రజలు ఈస్టర్ పండుగ వైభవంగా నిర్వహించడం శుభ సాంప్రదాయమని అన్నారు. ఈ వేడుకకు విశిష్ట అతిథిగా పాల్గొన్న కిష్టారం ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మ మాట్లాడుతూ అంబేద్కర్ నగర్ తిరు హృదయ దేవాలయ నిర్మాణం అత్యంత వైభవంగా ఉందని, ఆలయాన్ని మరింత ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దడానికి సింగరేణి సంస్థ జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ తో చర్చించి సంస్థ తరపున నిధుల మంజూరుకు సహకరిస్తామని తెలిపారు. వేడుకకు హాజరైన అతిథులను సంఘస్తులు శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం సంఘస్థులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపదేశి శ్రీనివాసరావు, కిష్టారం సింగరేణి ప్రాజెక్ట్ మేనేజర్ రామకృష్ణ, క్వాలిటీ ఇంచార్జ్ అవినాష్, సంఘ పెద్దలు మారోజు నాగేశ్వరరావు, పాలకుర్తి వెంకటేశ్వరరావు, మారోజు శ్రీను, వాడపల్లి కోటేశ్వరరావు, పాగా పాపయ్య, రామాల రాములు, పాలకుర్తి ప్రవీణ్, పాలకుర్తి పుల్లయ్య, తాళ్ల నాగేంద్ర, రామాల వెంకటేష్, పాలకుర్తి జగన్, పాలకుర్తి కాంతయ్య, రామాల బాలరాణి, పాలకుర్తి జయంత్, వడ్డేపల్లి అరుణ అధిక సంఖ్యలో సంఘస్తులు పాల్గొన్నారు.

# వెంకటరెడ్డి మృతి కార్మికోద్యమాలకు తీరని లోటు

-సిపిఐ, ఏఐటియుసి నేతల నివాళి



**ప్రజాపక్షం/ అశ్వాపురం :** కార్మిక నాయకుడు ముల్కూరి వెంకటరెడ్డి మృతి కార్మికోద్యమాలకు తీరని లోటని సిపిఐ, ఏఐటియుసి నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులుగా, ఏఐటియుసి నాయకునిగా, కార్మిక వర్గ సమస్యల పరిష్కారం కోసం ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. శనివారం మరణించిన ముల్కూరి వెంకటరెడ్డి మృతదేహాన్ని ఆదివారం సిపిఐ, ఏఐటియుసి నేతలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఏఐఎస్ఎఫ్‌లో పని చేసిన వెంకటరెడ్డి తుదిశ్వాస వరకు ప్రజల హక్కుల కోసం, కార్మిక వర్గ సంక్షేమం కోసం కృషి చేశారన్నారు. కరోనా కష్ట కాలంలో మూడువేల కుటుంబాలకు ఆహార పదార్థాల పంపిణీలో ఆయన కీలక భూమిక పోషించారని తెలిపారు. ఆయన మృతి అత్యంత బాధాకరమని, ఆయన ఆశయ సాధనకు పునరంకితమవుతామన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్‌పాషా, ఏఐటియుసి నాయకులు శింగు నర్సింహారావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, నాయకులు మున్నా లక్ష్మి కుమారి, కమటం వెంకటేశ్వరరావు, అనంతనేని సురేష్, అనంతనేని విష్ణుప్రియ, ఎ. మల్లికార్జున్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్, సాయి, వివిధ సంఘాల నేతలు రాజేష్, సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, లింగయ్య, దండి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎఐటియుసిలో పలువురి చేరిక



**ప్రజాపక్షం/పాల్వంచ :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పని చేస్తున్న 50 మంది కాంట్రాక్ట్ కార్మికులు ఏఐటియుసి అనుభంధ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్‌లో ఆదివారం ఏఐటియుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, జిల్లా నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు , ఇట్టి వెంకటరావు ఆధ్వర్యంలో చేరారు. వారందరిని సాదరంగా సంఘంలోకి ఆహ్వానించారు. ఈ సంధర్భంగా నరాటి ప్రసాద్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా ప్రభుత్వం శ్రమ దోపడీకి పాల్పడుతుందని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థను రద్దు చేసి కార్మికులందరిని క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు రత్న, సరిత తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యుల జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం పరుగులు పెడుతున్న తరుణంలో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పుల తోపాటు యాంత్రికరణ వైద్యం అందుబాటులోకి వచ్చింది. వైద్య రంగంలో ఎన్నో సాంకేతిక మార్పులు చెందాయి కానీ గ్రామీణ స్థాయిలో గ్రామీణ వైద్యులు ప్రజలకు అందించే వైద్య సేవలు మాత్రం అంతగా గుర్తింపు సాధించడం లేదని ప్రస్తుతం ఈ తరుణంలో గ్రామీణ వైద్యులకు సాంకేతిక పరిజ్ఞానం ఒకవైపు గ్రామీణ వైద్యులకు వైద్యరంగంపై అవగాహన మరోవైపు కల్పించేందుకు ఏప్రిల్ 9న ఖమ్మం నగరంలో గ్రామీణ వైద్యుల 31వ జిల్లా మహాసభలను నిర్వహించబడుతున్నాయని, పట్టణ గ్రామీణ వైద్యుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు సుబ్బారావు తెలిపారు. సందర్భంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో గ్రామీణ వైద్యులను కలిసి పత్రాలను పంపిణీ చేశారు. ఈ జిల్లా మాసవులకు రాష్ట్ర నాయకత్వం పాల్గొంటుందని గ్రామీణ వైద్యులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై వారు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారని జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని, ప్రతి గ్రామీణ వైద్యులు మహా సభలకు హాజరుకావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కేయు, భాస్కర్ కోశాధికారి ఎస్.కె, రబ్బాని, జి.రమేష్, శ్రీను, డి.వెంకటేశ్వర్లు జి.నవీన్ బోస్ పాల్గొన్నారు.

# మహనీయుల ఆశయాలు ఆచరణలో పెట్టాలి

**- కలెక్టర్ అంకిత్**







**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** మహనీయుల ఆశయాలను అంతా ఆచరణలో పెట్టిన నాడే అనుకున్న సమాజం నిర్మితమవుతుందని జిల్లా కలెక్టర్ అంకింత్ అభిప్రాయపడ్డారు. బాబూజగ్జీవన్ రామ్ 119వ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ సెంటర్, కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి అంకిత్ ముఖ్యాతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆయన దేశ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం పాటు దేశరాజకీయాల్లో విశిష్ట సేవలు అందించారన్నారు. సమాజిక న్యాయ సాధనకు అనునిత్యం పరితపించిన మహానేత అన్నారు. ఆయన జీవితాన్ని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. కేంద్రప్రభుత్వ అనేక శాఖల్లో మంత్రిగా పనచేసిన ఆయన భారత ఉప ప్రధానిగా సమర్ధవంత పాలన అందించారని చెప్పారు. మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజంలో వివక్ష లేకుండా ముందుకు సాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్పి రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు, మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, శ్రీలత, దాసరి శ్రీను, మందా హన్మంతు, మద్దెల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్పి కార్యాలయంలో...

ఎస్పి కార్యాలయంలో భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి రోహిత్ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన ఆయన అంచలంచెలుగా ఎదిగి దేశ ఉప ప్రధాని వరకు చేరుకున్నారని చెప్పారు. అంటరాని తనానికి ఆయన గళమెత్తారని, విద్యనే ఆయుధంగా మలుచుకుని అన్యాయాలపై పోరాటాలు చేశారని చెప్పారు. ఆయన ఆశయన సాధన కోసం అంతా కృషి చేయాలని, సమసమాజ స్థాపనకు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

### భద్రాచలంలో...

అనగారిన వర్గాల సమానత్వం కోసం బాబూ జగ్జీవన్ రామ్ నిరంతరం కృషి చేయాలని ఐటిడిఏ ఎస్‌డిసి రవీంద్రనాద్ అన్నారు. ఐటిడిఏ సమావేశ మందిరంలో జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, ఆదినారాయణ, శ్రీనివాస్, మోహన్, లక్ష్మయ్య, పవన్, గణేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఘనంగా మల్లు వారి రిసెప్షన్ వేడుక

**-హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు -పెద్ద సంఖ్యలో ప్రజలు**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, నందిని దంపతుల కుమారుడు మల్లు సూర్య విక్రమాదిత్య, సాక్షిల వివాహ రిసెప్షన్ వేడుక ఆదివారం అత్యంత ఘనంగా జరిగింది. ఖమ్మం నగరంలోని వైఎస్ఆర్ కాలనీ సమీపంలో గ్రీన్‌హిల్స్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి ఉమ్మడిజిల్లా నలు మూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రాగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మధిర నియోజక వర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఖమ్మం జిల్లాకు చెందిన అధికార యంత్రాంగం ముఖ్యంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్ సహా వివిధ శాఖల అధికారులు రిసెప్షన్ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. భారీగా జనం తరలి వచ్చినప్పటికీ ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వాలంటీర్లు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# ప్రజల గొంతుకగా 'ప్రజాపక్షం'

**-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజల గొంతుకగా 'ప్రజాపక్షం' పని చేయాలని ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఖమ్మం ఎడిషన్ 'ప్రజాపక్షం' పాత్రికేయుల సమావేశం ఆదివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దండి సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల దరి చేర్చడంతో పాటు అర్హులకు పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. పాలక వర్గాలు ప్రజా సమస్యలను విస్మరిస్తున్న క్రమంలో ప్రభుత్వం దృష్టికి ప్రజా సమస్యలను తీసుకెళ్లేందుకు పాత్రికేయులు కృషి చేయాలన్నారు. మీడియాలో అతి వేగంగా మార్పులు వచ్చాయని ప్రజల పక్షాన కాకుండా వ్యక్తిగత ఎజెండాలను అమలు చేయడం ద్వారా ప్రజలకు నష్టం కలుగుతుందని సురేష్ తెలిపారు. మీడియాలో వచ్చిన ఆరోగ్యకరమైన మార్పులను గమనిస్తూ, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంలో ప్రజాపక్షం ముందు వరుసలో ఉండాలన్నారు. ప్రజల గొంతుకగా పత్రిక పనిచేసినప్పుడే ఆదరణ పెరుగుతుందన్నారు. వాణిజ్య ధృక్పథంతో కాకుండా ప్రజల పక్షాన పనిచేస్తున్న ఏకైక పత్రిక ప్రజాపక్షమని రానున్న కాలంలో దీనిని మరింత విస్తరించి ప్రజల ముంగిటకు సకాలంలో చేర్చేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎడిషన్ ఇంచార్జి ఏనుగు వెంకటేశ్వరరావు, ఎడివిటి ఇంచార్జి టికె ప్రసన్నన్, సబ్ కమిటీ కన్వీనర్ బిజి క్లైమెంట్, సభ్యులు బెజవాడ రవి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బాధ్యులు పి. సత్యానంద్, పలువురు ఆర్‌సి ఇంచార్జిలు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# పోలిశెట్టిగూడెంలో పారిశుధ్యం అస్తవ్యస్తం..!

**- 99రోజుల ప్రణాళికలో మారని గ్రామ దుస్థితి**
**- కార్యదర్శి నిర్లక్ష్యంతో మంటలకు ఆహుతైన పచ్చని చెట్లు?**
**- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు**







**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని పోలిశెట్టిగూడెంలో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99రోజుల ప్రణాళిక గ్రామంలో తూతూ మంత్రంగానే సాగుతోందని విమర్శిస్తున్నారు. ప్రణాళికలో భాగంగా కేవలం ప్రధాన రహదారులపై మాత్రమే పరిశుభ్రత చర్యలు చేపడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అంతర్గత వీధులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని, దాంతో దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు అనారోగ్య భయంతో వణుకుతున్నామని వాపోతున్నారు. అదేవిధంగా నిర్లక్ష్యంతో పచ్చని మొక్కలు అగ్నికి ఆహుతైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రోజురోజుకు మరింత తీవ్రంగా సమస్యలు మారుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నీరుగారుతున్న ప్రణాళిక...

99రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, అధికారులు నిర్లక్ష్యానికి పరకాష్టగా కనిపిస్తోంది. దీంతో కాల్వలలో మురుగు పేరుకుపోయి దర్వాసన వెదజల్లడంతో పాటు దోమల పెరుగుదలకు కారణమవుతోంది. కేవలం ప్రధాన ప్రాంతాల్లో మాత్రమే డ్రైనేజీలు, చెత్తాచెదారం తొలగింపు చర్యలు చేపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామంలోని అంతర్గత వీధులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు మంజూరైనప్పటికీ, అమలులో మాత్రం అలసత్వం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అగ్నికి ఆహుతైన మొక్కలు...

జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలలో అధికారుల సాక్షిగా పచ్చని మొక్కలు అగ్నికి ఆహుతి కావడం ఆందోళన కలిగిస్తున్నాయి. గతంలో పనిచేసిన ప్రధానోపాధ్యాయుడు నాగటి ప్రసాద్‌రావు 2013లోనే మొక్కలు నాటి పాఠశాలను పచ్చని హరితవనంగా తీర్చిదిద్దారు. ఆ సమయంలో పాఠశాల పరిశరాలు పచ్చదనంతో కళకలాడుతూ గ్రామ ప్రజల ప్రశంసలు అందుకున్నాయి. అయితే ఇటీవల పాఠశాల పరిశుభ్రత పేరుతో గ్రామ కార్యదర్శి పనివారిని పంపించగా..వారు పాఠశాలలో సేకరించిన చెత్తను పచ్చని చెట్ల మధ్య పోసి తగులబెట్టిన్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో అనేక పచ్చని మొక్కలు మంటలకు ఆహుతయ్యాని తెలుపుతున్నారు. ఈ సమయంలో అక్కడ ఉన్న ఓ ఉపాధ్యాయుడు కూడా స్పందించకుండా చోద్యం చూసినట్లు ఆరోపిస్తున్నారు. గ్రామ కార్యదర్శి నిర్లక్ష్యవైఖరి, ఉపాధ్యాయుడి ఉదాశీనత కారణంగా పాఠశాల హరితవనం తీవ్రంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మొక్కలకు ఇగురు కూడా వచ్చింది : గ్రామ కార్యదర్శి, రజిత

పాఠశాలను పరిశుభ్రం చేసేందుకు కార్మికులను పంపించాను. వారు శుభ్రం చేసి చెట్ల మధ్యలో నిప్పు పెట్టడంతో జరిగింది. అది జరిగి నేటికి నెలరోజులు కావోస్తుంది. మొక్కలు ఇగురు కూడా వచ్చినట్లుగా వివరణ ఇచ్చారు. 99రోజుల ప్రణాళిక పకడ్బంధీగా నిర్వహిస్తున్నాట్లు తెలిపారు.

# సోషల్ మీడియాలో పాలేరు కార్యదర్శి హరీష్‌పై దుష్ప్రచారం

**ప్రజాపక్షం/కూసుమంచి:** పాలేరు గ్రామ పంచాయితీ కార్యదర్శి హరీష్‌పై శనివారం నాడు సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ముగ్గురి వద్ద మూడు ఇల్లు ఆన్‌లైన్ వ్యవహారంలో కార్యదర్శి లంచం తీసుకున్నాడంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం కలకలం రేపింది. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తులను ప్రశ్నించగా, కార్యదర్శి హరీష్ తమ వద్ద ఎలాంటి లంచం తీసుకోలేదని వారు స్పష్టంగా వెల్లడించారు. తాము ఇచ్చిన దరఖాస్తులు, ఆన్‌లైన్ ప్రక్రియలు సాధారన విధానంలోనే పూర్తయ్యాయని, ఎవరూ డబ్బులు అడగలేదని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పంచాయితీ కార్యదర్శి హరీస్ స్పందిస్తూ, తనపై కావాలనే తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సేవలను నిబద్ధతతో నిర్వహిస్తున్న తనను లక్ష్యంగా చేసుకుని కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఎవరైనా నిరాధార ఆరోపణలు సరికాదని సంబంధిత ఆధారాలతో అధికారుల ముందు పెట్టాలని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియలో నేను ఎవరి వద్ద డబ్బులు తీసుకోలేదని, ఈ విషయంలో సంబంధిత వ్యక్తులే తమ వద్ద నుండి ఎటువంటి లంచం తీసుకోలేదని చెబుతున్నారు. అయినప్పటికీ నా ప్రతిష్ట దెబ్బతీయాలనే ఉద్దేశంతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆధారాలు లేకుండా సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు చేయడం వల్ల ప్రభుత్వ ఉద్యోగుల ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా గ్రామంలో అపోహలు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు.